లేబర్‌కోడ్లను రద్దు చేయాల్సిందే

- ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలి
- కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి
- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి
- కేంద్ర కార్మిక శాఖ కార్యాలయం వద్ద నిరసనలో కార్మిక సంఘాల నేతలు
- వందలాదిగా తరలొచ్చిన కార్మికులు

నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాల్సిందేనని కార్మిక సంఘాల నేతలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. దేశ ప్రయోజనాల రీత్యా ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని వారు నొక్కి చెప్పారు. మోడీ సర్కారు కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని పట్టుబట్టారు. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్‌లో విద్యానగర్‌లో గల కేంద్ర కార్మిక శాఖ ప్రాంతీయ కార్యాలయం వద్ద కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం రీజినల్ సెంట్రల్ లేబర్ (కేంద్ర కార్మిక శాఖ) డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌కు కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు వినతి పత్రం అందజేశారు.

నిరసనను ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. పహల్గాంలో ఉగ్రవాద ఘాతుకం అనంతరం దేశంలోని పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న జాతీయ కార్మిక సంఘాలు జాతీయ సమ్మెను 2025 జూలై 9కి వాయిదా వేశాయని తెలిపారు. 11 ఏళ్లుగా బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను దూకుడుగా అమలు చేస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వరంగాన్ని ధ్వంసం చేస్తున్న తీరును ఎండగట్టారు. కార్మికవర్గం సమరశీల పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందని ఎత్తిచూపారు. లేబర్‌కోడ్‌లకు వ్యతిరేకంగా సంఘాలకు అతీతంగా కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జూలై తొమ్మిది వరకు ఈ నిరసనలను కొనసాగించాలని కోరారు.ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ మాట్లాడుతూ 2025-26 బడ్జెట్‌లో కేంద్రం కార్పొరేట్లకు అనుకూలంగా కేటాయింపులు చేసిందనీ, సామాజిక సంక్షేమానికి కోతలు పెట్టిందని విమర్శించారు. సామాన్యులపై భారాలు మోపి, కార్పొరేట్ గుత్త సంస్థలకు, పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితీలు ప్రకటించిన తీరును ఎండగట్టారు. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోకపోగా ఈ సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చే ఆర్థిక విధానాలను విచక్షణారహితంగా అమలు చేస్తున్నదని విమర్శించారు.

ఐఎన్‌టియుసి సీనియర్ ఉపాధ్యక్షులు జనక్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు, భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకొనేందుకు కార్మికవర్గం పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. టియుసిఐ ప్రధాన కార్యదర్శి కె.సూర్యం మాట్లాడుతూ..కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న విధానాల వల్ల దేశంలో ఐదుశాతమున్న పెట్టుబడిదారుల వద్ద 70 శాతం సంపద పోగుపడిందనీ, 50 శాతం ప్రజల చేతుల్లో కేవలం మూడు శాతం సంపదే ఉందని చెప్పారు. రోజుకు రూ.178 జీతం ఉంటే చాలని పాలకులు నిర్ణయించడం దారుణమన్నారు. బతకడానికి రోజుకు రూ.178 చాలన్న పాలకులకు లక్షల రూపాయల జీతాలెందుకని ప్రశ్నించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ..దేశంలో పేదరికం 17 శాతానికి పెరిగిందనీ, నిత్యావసర సరుకుల ధరలు కార్మిక, పేద ప్రజల జీవితాలను కష్టాలపాలు చేస్తున్నాయని వాపోయారు. మోడీ సర్కార్ విధానాలను కార్మికవర్గం ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసనకు సంఘీభావం తెలుపుతూ ఎస్‌కేఎం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, పశ్యపద్మ, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శోభన్ నాయక్ మాట్లాడుతూ...ఢిల్లీ రైతాంగ పోరాటం సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను మోడీ సర్కార్ విస్మరించిందని విమర్శించారు. ఢిల్లీలో జరిగిన రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో కార్మికులు, కర్షకులు కలిసి పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. ఈ నిరసనలో సిటైఐయు రాష్ట్ర ఆఫీస్ బేరర్లు జె.వెంకటేశ్, వీఎస్.రావు, కె.ఈశ్వర్‌రావు, పి.శ్రీకాంత్, కూరపాటి రమేశ్, రాష్ట్ర నాయకులు పి.సుధాకర్, ఎ.సునీత, కుమారస్వామి, రాజుభట్, నగర నాయకులు అజయ్‌బాబు, రాములు, శ్రీనివాస్, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రేంపావని, కార్యదర్శి బి.వెంకటేశ్, నాయకులు కమతం యాదగిరి, బొడ్డుపల్లి కిషన్, టియుసిఐ రాష్ట్ర నాయకులు ఎస్‌ఎల్.పద్మ, ఐఎఫ్‌టియు నాయకులు అనురాధ, ఐఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శులు ఆర్‌డి చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి, ఆదిల్ షరీఫ్, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ యాదవ్, జగన్మోహన్‌రెడ్డి, అబ్రహం, ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఎల్‌డి పాల్, మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఉపాధికి బాటలు

- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం-3లోని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో గల ఎంవిటిసిలో సింగరేణి సంస్థ సిఎస్‌ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని మంగళవారం మంత్రి ప్రారంభించారు. రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీయువకుల్లో వృత్తి నైనుణ్యాలను పెంపొందించి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో సింగరేణి సంస్థ వివిధ ఏరియాల్లో ఇలాంటి శిక్షణా కేంద్రాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా సుమారు 38 కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మంచి ఉపాధి పొందాలని సూచించారు. శిక్షణ పొందే అభ్యర్థులు కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా, పూర్తిస్థాయిలో శిక్షణ పొంది నైపుణ్యాన్ని సాధించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని, త్వరలో రాష్ట్రంలో నైపుణ్య సర్వే నిర్వహించి, నిరుద్యోగుల నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. సింగరేణి యాజమాన్యం ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఒక కళాశాలగా అభివృద్ధి చేసి, ఇక్కడి నుంచే నియామకాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకుర్, సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

టిజిఆర్‌జెసి సెట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ నడుపుతున్న 35 గురుకుల జూనియర్ కాలేజీల్లో 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన టిజిఆర్‌జెసి సెట్ రాతపరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు ఆ సంస్థ కార్యదర్శి సిహెచ్ రమణకుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల పదో తేదీన రాతపరీక్షను నిర్వహించామని తెలిపారు. 74,614 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారనీ, వారిలో 61,476 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని వివరించారు. గ్రూపు వారీగా విద్యార్థుల మార్కులు, ర్యాంకుల జాబితాను http://tgrjc. cgg. gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు కనీస అర్హత మార్కుల్లేవనీ, ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేసి కోరుకున్న కాలేజీలో ప్రవేశాలను కల్పిస్తామని తెలిపారు. ఈనెల 24న విద్యార్థుల మొబైల్ నెంబర్‌కు సమాచారాన్ని పంపిస్తామని పేర్కొన్నారు. ఎంపిక పత్రాన్ని వెబ్‌సైట్ ద్వారా పొందాలని సూచించారు. ఇంగ్లీష్ మీడియంలో ఎంపిసి, బైపిసి, ఎంఇసి గ్రూపుల్లో 35 జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలను కల్పిస్తామని వివరించారు.

మినీ అంగన్‌వాడీలకు జీతాలను తగ్గించడం దారుణం

- రూ. 13,650 రూపాయల నుంచి రూ. 7,800కి కుదించడం అన్యాయం
- సిఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మినీ అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలను రూ.13,650 నుంచి రూ.7,800కి తగ్గించడం అన్యాయమని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. మంగళవారం ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని 3,989 మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న మానసిక వేదన, వారి కుటుంబాల ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 5న వారికి అంగన్వాడీలుగా పదోన్నతి కల్పిస్తూ జిఒ జారీ చేసిందని, ఎన్నికల కోడ్ కారణంగా ఆ ఉత్తర్వులు అమలు కాలేదని గుర్తుచేశారు. మంత్రి సీతక్క బాధ్యతలు స్వీకరించాక మినీ అంగన్వాడీలను అంగన్వాడీలుగా గుర్తిస్తూ తొలిసంతకం చేశారని గుర్తుచేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవోనే తాము విడుదల చేసినట్టు రాజకీయ లబ్ది పొందే ప్రయత్నాన్ని కాంగ్రెస్ సర్కారు చేసిందని విమర్శించారు. 2024 జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలలు అంగన్వాడీ పే గ్రేడ్‌లో రూ.13,650 జీతాన్ని ప్రభుత్వం చెల్లించిందని గుర్తుచేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల వరకు మినీ అంగన్‌వాడీలకు రూ.7,800 వేతనమే చెల్లించిందని వాపోయారు. అంగన్‌వాడీలుగా గుర్తించి మినీ అంగన్వాడీ జీతాలతో పనిచేయించడం దారుణమని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ అని చెబుతూ అంగన్వాడీల జీతాలు తగ్గించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. బహుశా ఇలాంటి విధానం దేశంలో ఎక్కడా లేదు కావొచ్చు? అని పేర్కొన్నారు. ఒకే పనికి రెండు సార్లు జీవోలు జారీ చేసి, రాజకీయ ప్రచారం చేసుకోవడం తప్ప, మినీ అంగన్వాడీలకు ఎలాంటి న్యాయం జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని మినీ అంగన్వాడీలనే కాదు మహిళలందర్నీ అన్ని విషయాల్లో మోసం చేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తాను విడుదల చేసిన జీవోను గౌరవించి జనవరి 2024 నుంచి మినీ అంగన్వాడీలకు పెంచిన జీతం చెల్లించాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో జూనియర్ సివిల్ జడ్జి ప్రసవం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజన్న సిరిసిల్ల జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న జ్యోతిర్మయి వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవించారు. మగ బిడ్డకు మంగళవారం ఆమె జన్మనిచ్చారు. ప్రసూతి వైద్య సేవలకు ఆమె సివిల్ ఆస్పత్రిలో చేరడంపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు తెలిపారు. సర్కారు దవాఖానాల పట్ల నమ్మకం పెంచే విధంగా న్యాయమూర్తి జ్యోతిర్మయి ఆదర్శంగా నిలిచారని ఎక్స్ వేదికగా ప్రశంసించారు. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డా.బి ఉషకు మిస్టర్ అండ్ మిసెస్ ఉత్తమ వ్యక్తిత్వ అవార్డు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రేఖా దేశాయ్ మార్గదర్శకంలో పీచ్ ఈవెంట్స్ సంస్థ నిర్వహించిన మిస్టర్ అండ్ మిసెస్ సీనియర్ పేషన్ పోటీల్లో డా. బి ఉష ఉత్తమ వ్యక్తిత్వ అవార్డు సాధించింది. ముంబైలో జరిగిన ఫైనల్స్‌కు దేశ వ్యాప్తంగా 25 మంది పోటీ పడగా డా. బి ఉష ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ శాఖలో సంయుక్త కార్యదర్శిగా సేవలందించిన డా.ఉష... 30 ఏళ్లుగా ప్రజా సేవలో ఉన్నారు. ఆమె పనితీరుకు గుర్తింపుగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో అనేక పురస్కారాలు పొందారు.

రేపటినుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- 4.2 లక్షల మంది దరఖాస్తు
- 892 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గురువారం నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 29 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇంటర్ బోర్డు అధికారులు సర్వంసిద్ధం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు 4.2 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వారి కోసం 892 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురువారం నుంచి జరిగే ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయి. ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకూ ఇదే షెడ్యూల్ వర్తిస్తుంది. ఇప్పటికే ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఈనెల 29 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభమవుతుంది. వచ్చేనెల ఒకటో తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

టిజిఆర్‌జెసి సెట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర గురుకుల విద్యాలయాల సంస్థ నడుపుతున్న 35 గురుకుల జూనియర్ కాలేజీల్లో 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన టిజిఆర్‌జెసి సెట్ రాతపరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు ఆ సంస్థ కార్యదర్శి సిహెచ్ రమణకుమార్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల పదో తేదీన రాతపరీక్షను నిర్వహించామని తెలిపారు. 74,614 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారనీ, వారిలో 61,476 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని వివరించారు. గ్రూపు వారీగా విద్యార్థుల మార్కులు, ర్యాంకుల జాబితాను *http:// tgrjc. cgg. gov.in* వెబ్‌సైట్‌లో పొందుపర్చామని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు కనీస అర్హత మార్కుల్లేవనీ, ప్రతిభ, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేసి కోరుకున్న కాలేజీలో ప్రవేశాలను కల్పిస్తామని తెలిపారు. ఈనెల 24న విద్యార్థుల మొబైల్ నెంబర్‌కు సమాచారాన్ని పంపిస్తామని పేర్కొన్నారు. ఎంపిక పత్రాన్ని వెబ్‌సైట్ ద్వారా పొందాలని సూచించారు. ఇంగ్లీష్ మీడియంలో ఎంపిసి, బైపిసి, ఎంఇసి గ్రూపుల్లో 35 జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలను కల్పిస్తామని వివరించారు.

రైతులకు భూ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- జూన్ 2 నుంచి రాష్ట్రమంతటా అమలు
- 6 వేల మంది ప్రయివేట్ సర్వేయర్ల ఎంపిక : మంత్రి పొంగులేటి

సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాశ్వత భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'భూభారతి (ఆర్‌ఓఆర్)' చట్టాన్ని తీసుకొచ్చి రైతులకు అంకితం చేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో, మంచిర్యాల జిల్లా భీమారంలో మంగళవారం భూభారతిపై రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ముందుగా ముప్పిరితోటలో మంత్రి మాట్లాడుతూ.. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ వల్ల రైతుల సమస్యలు పెరిగి, కుటుంబాల్లో వివాదాలకు దారి తీసిందన్నారు. సాదాబైనామా అంశాన్ని ధరణిలో చేర్చకపోవడం వల్ల భూ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ స్థాయి నుంచి సిసిఎల్‌ఎ వరకు రైతులు తిరగాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులు, మేధావులు, ప్రజలతో చర్చించి అందరూ కోరుకున్న విధంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ చట్టాన్ని ప్రవేశపెట్టి పలు మండలాల్లో ప్రయోగాత్మకంగా నిర్వహించామని చెప్పారు. ఈ చట్టంలో రైతులకు అన్ని హక్కులూ కల్పిస్తూ జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్టు వెల్లడించారు. రైతుల దరఖాస్తులను పరిశీలించి క్షేత్ర స్థాయిలో భూములను సర్వే చేయడానికి రాష్ట్రంలో 6,000 మంది ప్రయివేటు సర్వేయర్లను ఎంపిక చేసి వారం రోజుల్లో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. ప్రతి రెవెన్యూ కార్యాలయంలో డిసెంబర్ 31న జమాబందీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు.

సాగునీరు అందించేందుకు కృషి: మంత్రి శ్రీధర్‌బాబు

జిల్లాలోని రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తానని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. కొదురుపాక రిజర్వాయర్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సుల్తానాబాద్ పెద్దపల్లి బైపాస్ రోడ్డు నిర్మాణానికి నిధులు వెచ్చించామని, టెండర్లు కూడా పూర్తయ్యాయని చెప్పారు. బీజేపీ దేశంలో తప్పుడు ప్రచారాల కోసం వాట్సాప్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకుందని విమర్శించారు. వరి ధాన్యం కొనుగోలులో గత ప్రభుత్వం 2022-23లో రూ.290 కోట్లు ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రూ.700 కోట్లు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు చేసిందని వివరించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు చెక్కులు, రైతులకు భూభారతి ప్రొసీడింగ్‌లను మంత్రులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, ఎమ్మెల్సీ తానిపర్తి భాను ప్రసాదరావు, సలహాదారు వేణుగోపాలరావు, జిల్లా గ్రంథాలయ చైర్మెన్ అన్నయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఫారెస్టు వివాదాలకు పరిష్కారం..

భూభారతి-2025 చట్టం ద్వారా భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించనున్నామని మంచిర్యాల జిల్లా భీమారం సదస్సులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 18 రాష్ట్రాల్లో అమలవుతున్న చట్టాలను అధ్యయనం చేసి భూభారతి చట్టం తీసుకొచ్చినట్టు తెలిపారు. వంద రోజుల్లో ఈ చట్టం ద్వారా భూసమస్యలకు పరిష్కారం చూపించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు జిల్లాల్లో నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టులుగా గుర్తించి అవగాహన కల్పిసున్నట్టు తెలిపారు. భీమారం మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించి భూసమస్యల పరిష్కారం కోసం ఇప్పటి వరకు 22 వందల మంది నుంచి దరఖాస్తులు స్వీకరించినట్టు వెల్లడించారు. ఇందులో 11 వందల దరఖాస్తులు ఉన్నట్టు తెలిపారు. సాదాబైనామా అంశంలో కోర్టులో స్టే ఉన్నందున అతి త్వరలో ఈ సమస్యలను కూడా పరిష్కరించుకుందామన్నారు. ఈ ప్రాంత రైతులు చెప్పినట్టు ఫారెస్ట్ వివాదం, ప్రభుత్వ భూముల ఇబ్బందులను పరిష్కరించేందుకు కలెక్టర్‌కు ఆదేశాలిస్తున్నట్టు ప్రకటించారు. సదస్సులో ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వినోద్, కలెక్టర్ కుమార్‌దీపక్ పాల్గొన్నారు.

డాక్టర్ జయంత్ నార్లికర్‌కు జన విజ్ఞాన వేదిక నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త, ప్రజాదరణ పొందిన డాక్టర్ జయంత్ నార్లికర్‌కు జన విజ్ఞాన వేదిక నివాళు లర్పించింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. "ఖగోళ భౌతిక శాస్త్రం, విశ్వ శాస్త్రంలో అగ్రగామి అయిన ప్రొఫెసర్ జయంత్ విష్ణు నార్లికర్ సోమవారం రాత్రి (మే 19న) మరణించారు. ముంబైలోని ఇంటర్-యూనివర్శిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిసిక్స్ (ఐయుసిఏఏ)లో ఖగోళ భౌతిక శాస్త్రవేత్త, ఎమెరిటస్ ప్రొఫెసర్‌గా చిన్న వయస్సులోనే బాధ్యతలు నిర్వర్తించారు. యుకెలోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ విద్యార్థిగా ఆయన, ప్రఖ్యాత ఖగోళ భౌతిక శాస్త్రవేత్త సర్ ఆల్ఫ్రెడ్ హోయల్‌తో కలిసి పని చేశారు. హొయ్లే-నార్లికార్థియరీ అని పిలువబడే కన్ఫార్మల్ గ్రావిటీ సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశారు. ఈ సిద్ధాంతం ఐన్ స్టీన్ సాపేక్షత సిద్ధాంతాన్ని, మాక్ సూత్రాన్ని సంశ్లేషణ చేస్తుంది, ఒక కణం యొక్క జడత్వ ద్రవ్యరాశి అన్ని ఇతర కణాల ద్రవ్యరాశి యొక్క ఫంక్షన్, ఇది కాస్మిక్ యుగం యొక్క ఫంక్షన్. నార్లికర్ విశ్వోద్భవ శాస్త్రంలో తన కృషికి ప్రసిద్ధి చెందారు, ముఖ్యంగా ప్రసిద్ధ బిగ్ బ్యాంగ్ మోడల్ (1994-1997) కు ప్రత్యామ్నాయ నమూనాలను సమర్థించడంలో, ఇది విశ్వ సృష్టికి ప్రామాణిక వివరణ...." అని జెవివి పేర్కొంది. జయంత్ నార్లికర్ 1938 జులైలో మహారాష్ట్ర షోలాపూర్‌లో జన్మించారు. సమాజంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేశారు. ఈ క్రమంలో నార్లికర్ పద్మ విభూషణ్, పద్మభూషణ్ తదితర అవార్డులను అందుకున్నారు. ప్రజల్లో శాస్త్రీయ ఆలోచన పెంచేందుకు పాటుపడ్డారు. ఆయన మరణం, ముఖ్యంగా ప్రస్తుతం మూఢ నమ్మకాలు, నకిలీ సైన్స్ పట్ల సమాజంలో పెరుగుతున్న భావాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న సమయంలో నార్లికర్ మరణం తీరని లోటని జెవివి పేర్కొంది.

అంగన్వాడీలకు అన్యాయం చేసింది హరీశ్‌రావే

- ఆయన ఆత్మపరిశీలన చేసుకోవాలి : మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్‌రావు ఆర్థిక మంత్రిగా ఉండి అంగన్వాడీలకు తీవ్ర అన్యాయం చేశాడని, ఈ విషయంలో ఆయన బహిరంగ లేఖ రాయడం మానుకుని ఆత్మపరిశీలన చేసుకోవాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) సూచించారు. గత బిఆర్‌ఎస్ సర్కారు ఓట్ల కోసం ఇచ్చిన మొక్కుబడి జిఒల చిక్కుముడులను విప్పి ఇప్పుడు పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్వాడీ టీచర్ల జీతాలపై సిఎంకు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ రాయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపట్ల చిత్తశుద్ధి ఉంటే పదేండ్లలో మెయిన్ అంగన్వాడీలుగా ఎందుకు పదోన్నతులు కల్పించలేదు? అధికారం పోగానే గుర్తుకువస్తున్నాయా? అని ప్రశ్నించారు. గత సర్కారు ఆర్థిక శాఖ అనుమతులు లేకుండా జారీ చేసిన జీవోలు పనికి రాకుండా పోయాయని విమర్శించారు. ఇప్పుడు తాము జిఒలను చట్టబద్ధంగా, పకడ్బందీగా అమలు చేసి చూపిస్తున్నామని తెలిపారు. తాము చట్టబద్ధంగా, ఆర్థిక శాఖ అనుమతులతో 3438 మంది మినీ అంగన్వాడీ టీచర్లకు పదోన్నతులు కల్పించామని గుర్తు చేశారు. ఈ నెల నుంచే మెయిన్ అంగన్వాడీల తరహాలోనే మినీ అంగన్వాడీలకు జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. మినీ కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేసి టీచర్లకు తోడుగా హెల్పర్లను నియమించబోతున్నామని ప్రకటించారు.

వడదెబ్బతో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎండల తీవ్రత.. వడగాడ్పుల వల్ల వడదెబ్బకు గురై మంగళవారం ముగ్గురు ప్రాణం కోల్పోయారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలోని న్యూకాలనీకి చెందిన షేక్ అమన్ (18) వడదెబ్బతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... అమన్ మూడ్రోజులు ఎండలో క్రికెట్ ఆడాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో మైదానంలో క్రికెట్ ఆడుతూ వాంతులు చేసుకున్నాడు. స్థానికులు బోథ్ అస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. జనగామ జిల్లా గణపురం మండల కేంద్రానికి చెందిన భామండ్లపల్లి కుమారస్వామి (40) సోమవారం మధ్యాహ్నం సమయంలో పనిమీద బయటకు వెళ్లాడు. వచ్చేటప్పటికే తీవ్ర అలసటగా ఉండటంతో పడుకున్నాడు. మంగళవారం ఉదయం చూసేసరికే విగతజీవిగా మారాడు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ నది పుష్కరాల్లో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న మంతెన శ్రీనివాస్ (35) ఎండతీవ్రతకు తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందాడు. మూడ్రోజులుగా కాళేశ్వరంలో పారిశుద్ధ కార్మికుడు (మల్టీ పర్పస్ వర్కర్) శ్రీనివాస్ పని చేశాడు. అనారోగ్యానికి గురవ్వడంతో మహాదేవపూర్ అస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి మృతి చెందారు.

దేశానికి ప్రమాదం ఉగ్రవాదులా? మావోయిస్టులా?

- భారత డిఫ్యాక్టో ప్రధానిగా వ్యవహరిస్తున్న ట్రంప్
- సిపిఐ నేతలు నారాయణ, కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ దేశానికి ప్రమాదకరం ఉగ్రవాదులా?, మావోయిస్టులా? అని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మావోయిస్టులపై ఉన్న ద్వేషం ఉగ్రవాదులపై లేనట్టు ఉందని చెప్పారు. అందుకే మావోయిస్టులతో చర్చలపై కేంద్రం స్పందించలేదన్నారు. భారత్‌కు అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ డిఫ్యాక్టో ప్రధానిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ట్రంప్ ఆదేశాలను మోడీ పాటిస్తుండడం భారత్‌కే అవమానకరమని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను ట్రంప్ శాసించే ప్రయత్నం చేస్తున్న మోడీ అడ్డుకోకుండా మౌనం వహించడం సిగ్గుచేటన్నారు. ఉగ్రవాదులు బహిరంగంగా తిరుగుతుంటే నిఘావర్గాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఉగ్రవాదులను ఏరివేసేందుకు కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు అన్ని పార్టీలూ మద్దతు ప్రకటించాయని గుర్తు చేశారు. కానీ ప్రధాని మోడీ ఉగ్రవాదులను అడ్డం పెట్టుకుని సొంత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సాఫ్ట్‌వేర్ రంగం అభివృద్ధి అంతా చంద్రబాబు హయాంలో జరిగిందంటూ గొప్పలు చెప్తారనీ, ఈ దేశ పౌరులకు అన్యాయం జరుగుతుంటే ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. సైనికులను అవమానించిన బిజెపి మంత్రిని తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరం ఇప్పుడు అందాల భామల చుట్టూ తిరుగుతోందన్నారు. వారి వెనుక మంత్రులు, అధికారులు తిరగడం సిగ్గుచేటన్నారు.

కొత్త పథకాల అమలుకు నిధులెక్కడివి? : కూనంనేని

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుపై స్పష్టతనివ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. పాత పథకాల అమలు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కొత్త పథకాల అమలు కోసం నిధులెక్కడివని అడిగారు. పాత పథకాలను అరకొరగా అమలు చేయడంతో ప్రజల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడుతోందన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఎంతమంది మావోయిస్టులను చంపేశారు, కేంద్ర ప్రభుత్వం లక్ష్యమేంటో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర బలగాలతో కలిసి రాష్ట్ర పోలీసులు సైతం ఇందులో పాల్గొంటున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సైతం తన విధానాన్ని ప్రకటించాలని కోరారు. ఉగ్రవాదులతో దౌత్యపరంగా చర్చలు జరుపుతామని ప్రకటించిన కేంద్రం, మావోయిస్టులతో శాంతి చర్చలకు ఎందుకు ముందుకు రావడం ప్రశ్నించారు.

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A. No. 2206/2024 in O.S. 289/2023

Between

పిన్నిబోయిన అనురాధ అండ్ అదర్స్

.... పిటీషనర్స్ / వాదులు

వర్సెస్

తాడిబోయిన మల్లిఖార్జునరావు

.... రెస్పాండెంట్ / ప్రతివాది

టు,
తాడిబోయిన మల్లిఖార్జునరావు, తండ్రి : రామయ్య, క్వార్టర్ నెం. బి-3/9, PTS NTPC, జ్యోతి నగర్, రామగుండం - 505215, కరీంనగర్ జిల్లా.

పై నెంబరు I.A. No. 2206/2024 ను పిటీషనర్లు మీపైన ఫైనల్ డిక్రీ కొరకు దాఖలు చేయగా అందు మీకు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపినను మీరు తీసుకోనందున మీకు పై ఐ.ఎ.లో నోటీసును ఈ ప్రకటన ద్వారా ఇవ్వవలసినదిగా ఆర్డరు వేస్తూ ది. 01-07-2025కి వాయిదా వేసినారు. సదరు తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టులో మీరు స్వయంగా గానీ, మీ ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై ఐ.ఎ.ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

వాయిదా : 01-07-2025

పి.తరుణ్‌కుమార్,
వి.కాశీవిశ్వనాథరాజు,
పిటీషనర్స్ తరపు అడ్వకేట్స్, తెనాలి.

వికలాంగులను పెళ్లి చేసుకుండే రూ.లక్ష ప్రోత్సాహకం

- ప్రభుత్వ నిర్ణయం పట్ల ముత్తినేని హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగులను వికలాంగులు పెళ్లి చేసుకుంటే ఆ జంటకు కల్యాణ లక్ష్మితో పాటు అదనంగా రూ. లక్ష ప్రోత్సాహకంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి వికలాంగుల ఆత్మబంధువు అని మరో సారి నిరూపించుకున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో వికలాంగులను వికలాంగులు పెండ్లి చేసుకుంటే రూపాయి కూడా రాక పోయేదని విమర్శించారు.
ఈ అంశంపై పదేళ్ల కాలంలో ఎన్నో ఉద్యమాలను చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో వికలాంగులకి సంబంధించిన ఒక్కో సమస్యా పరిష్కారమవుతూ వస్తున్నదని పేర్కొన్నారు. వికలాంగుల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తున్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నిధులు లేవని ముందు తెలియదా..?

- సుందరయ్య స్ఫూర్తితో పోరాడుదాం..
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదని, ఎన్నికలకు ముందు నిధులు లేవన్న విషయం తెలియదా.. అప్పుడు ఎందుకు మాట్లాడలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలో సోమవారం రాత్రి నిర్వహించిన సుందరయ్య 40వ వర్ధంతి సభలో జాన్‌వెస్లీ పాల్గొన్నారు. ముందుగా పార్టీ శ్రేణులు భారీ ర్యాలీతో నిర్వహించారు. అనంతరం సిపిఎం తల్లాడ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటం నడిపిన యోధులు, ఆదర్శ నేత దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు పార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో పార్టీ శ్రేణులు అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

పేద, ధనికుల మధ్య తేడా, అంటరానితనం, స్త్రీ పురుషుల, మధ్య అసమానత లేకుండా సమాజం ఉండాలని సుందరయ్య భావించారని గుర్తు చేశారు. సుందరయ్య మార్గంలో పోరాటాలను ముందుకు తీసుకోవడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. మోడీ కార్పొరేటర్లకు ఊడిగం చేస్తూ, కార్మిక, కర్షక వర్గాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని జాన్‌వెస్లీ అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత లక్ష మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, అయినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయం చేసే పరిస్థితి లేదని, 50 వేల నుంచి లక్ష ఎకరాల్లో కార్పొరేటర్లు, హెలికాప్టర్లతో వ్యవసాయం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని, వాటిల్లో రైతులు కూలీలుగా పనిచేసే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి నుంచి రైతులను వేరు చేసి దూరం చేసే కుట్రలు కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తే ఎర్రజెండా ఊరుకోదని, గ్రామ గ్రామాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, సిఐటియు జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

అంబేద్కర్ విగ్రహం వారికి కనపడలేదా?

- మాజీ ఎంపి బోయినపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంబేద్కర్ విగ్రహం వద్దకు మిస్ వరల్డ్ పోటీదారులను తీసుకువెళ్లకుండా రేవంత్ రెడ్డి ఎందుకు విస్మరించారని మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటికైనా వారిని అంబేద్కర్ విగ్రహం వద్దకు తీసుకెళ్లి చేసిన పొరపాటును సరిచేసుకోవాలని సీఎంకు హితవు పలికారు. జూన్ రెండున మిస్ వరల్డ్ విజేతలు, పోటీదారులను గవర్నర్ వద్దకు తీసుకువెళ్లే ముందు సచివాలయం ఎదురుగా ఉన్న అమరజ్యోతిని చూపించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం కమిషన్ నోటీసులపై వివరాలు తెలుసుకున్నాక స్పందిస్తామని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు.

రాజకీయ దురుద్దేశంతోనే కెసిఆర్‌కు నోటీసులు

- కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ పార్టీ అధినేత కెసిఆర్‌కు రాజకీయ దురుద్దేశంతోనే కాళేశ్వరం కమిషన్ నోటీసులు అందజేసిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అది కాళేశ్వరం కమిషన్ కాదు... కాంగ్రెస్ కమిషన్ అని మరోసారి తేటతెల్లమైందని పేర్కొన్నారు. కాళేశ్వరం అనేది ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన బృహత్ ప్రాజెక్టని తెలిపారు. ప్రజల దాహార్తిని తీర్చడానికే దాన్ని కెసిఆర్ ప్రభుత్వం నిర్మించిందని పేర్కొన్నారు. తెలంగాణ పొలాల్లోకి గోదావరి నీళ్లను పారించేందుకు ఆ ప్రాజెక్టును కట్టారని గుర్తు చేశారు. రాజకీయ కక్షతో, కుట్రతో ఇచ్చిన ఈ నోటీసులు, వేసిన కమిషన్లు కాలక్రమంలో కొట్టుకుపోతాయ వ్యాఖ్యానించారు. ఈ విషయంలో న్యాయమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రెవెన్యూ శాఖలో కారుణ్య నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం ప్రజావాణి ఇన్చార్జి డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య చొరవతో వేములపతి దేవికి రెవెన్యూ శాఖలో ఉద్యోగం కల్పిస్తూ కారుణ్య నియామకం ఉత్తర్వులను అధికారులు అందించారు. ఈ మేరకు మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో సిఎం ప్రజావాణికి వచ్చిన దేవి తన ఉద్యోగ నియామక ఉత్తర్వులను చిన్నారెడ్డి, దివ్యలకు చూపించి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ లోని మహంకాళి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న బి. రవికుమార్ విధి నిర్వహణలో 2018 నవంబర్ 17న మృతి చెందారు. అయితే మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా గిద్దలూరు వాసి కావడంతో ఆరేళ్లుగా ఆంధ్ర - తెలంగాణ ప్రభుత్వాల మధ్య కారుణ్య నియామక అంశం తేలకుండా పోయిందని ఆమె తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ సమస్యకు పరిష్కారం దొరికిందని పేర్కొన్నారు. కారుణ్య నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికులకిచ్చిన హామీలను అమలు చేయాలి

- టిపిజెఎసి, ఎన్‌ఎపిఎం ధర్నాలో నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని టిపిజెఎసి, ఎన్‌ఎపిఎం డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం టిపిజెఎసి, ఎన్‌ఎపిఎం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. ధర్నా సందర్భంగా పలు డిమాండ్లతో ప్ల కార్డులు, బ్యానర్లను ప్రదర్శించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయడానికి ఇప్పటి వరకు నిర్దిష్టమైన అడుగులు ప్రభుత్వం వైపు నుంచి పడలేదని విమర్శించారు. రాష్ట్రంలో గిగ్ అండ్ ప్లాట్ ఫాం కార్మికుల సంక్షేమానికి మే 1 నుంచి ప్రత్యేక చట్టం తెస్తామని ప్రకటించినప్పటికీ అదీ ఇంకా కార్యరూపం దాల్చలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కార్మిక శాఖను బలోపేతం చేసే దిశగా సిబ్బంది, అధికారుల సంఖ్యను పెంచాలనీ, ప్రభుత్వ సంస్థల్లో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలనీ, గిగ్ అండ్ ప్లాట్ ఫాం కార్మికులు, ఉద్యోగులకు సమగ్ర సంక్షేమ చట్టం వెంటనే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులు అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను ప్రారంభించాలనీ, స్కూల్స్‌లో మధ్యాహ్న భోజన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ కనీస వేతనం చెల్లించాలనీ, స్కూల్ స్వీపర్ల వేతనాన్ని రూ.21 వేలకు పెంచి రెగ్యులైజ్ చేయాలని కోరారు. పెరిగిన కార్మికుల సంఖ్యకు అనుగుణంగా మల్టీ స్పెషాలిటీ ఈఎస్ఐ ఆస్పత్రులను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలనీ, అసంఘటిత కార్మికుల సహజ మరణానికి రూ.5 లక్షల బీమా చెల్లించాలనీ, కార్మిక సంఘాలను భాగస్వాములుగా చేసుకుని అసంఘటిత కార్మికులను నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేద విధంగా హమాలీలు, గృహ కార్మికులు, చెత్త సేకరించే కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు, ఇతర అసంఘటిత కార్మికులు, ప్రభుత్వ రంగ సంస్థల కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిజెఎసి కో కన్వీనర్లు కె.రవిచందర్, కన్నెగంటి రవి, ఎన్‌ఎపిఎం జాతీయ కమిటీ సభ్యులు మీరా సంఘమిత్ర, రాష్ట్ర నాయకులు ఖలీదా పర్వీన్, ఎపిసిఆర్ రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ ఉస్మాన్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి శంకర్, గృహ కార్మికుల యూనియన్ (టిడిడబ్ల్యుయు) నాయకులు మంజుల, తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సామ్రాజ్యం, గిగ్ అండ్ ప్లాట్ ఫాం వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు షేక్ సలావుద్దీన్, హైదరాబాద్ చెత్త సేకరించే కార్మికుల కలెక్టివ్ ప్రతినిధి జయలక్ష్మి అరిపిన తదితరులు పాల్గొన్నారు.

'రజక' భవనం స్థలం పరిరక్షణకు చర్యలు

- నివేదిక ఇవ్వాలని రజక ఫెడరేషన్ ఎమ్‌డికి ప్రభుత్వం ఆదేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'రజకుల ఆత్మగౌరవ భవన స్థలంలో గుడిసెలు' అనే శీర్షికతో మంగళవారం మీడియాలో ప్రచురితమైన కథనాలకు బిసి సంక్షేమ శాఖ అధికారులు స్పందించారు. స్థలాన్ని పరిరక్షించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిపై నివేదిక ఇవ్వాలని రజక ఫెడరేషన్ ఎమ్‌డికి ఆదేశాలు జారీ చేశారు. గత రాష్ట్ర ప్రభుత్వం రజక ఆత్మగౌరవ భవన నిర్మాణానికి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలంలో స్థలం కేటాయించగా, అందులో ఇటీవల ఎనుముల రేవంత్‌రెడ్డి నగర్ పేరిట గుడిసెలు వెలిశాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల అశయ్య నేతృత్వంలో బిసి సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి ఇ శ్రీధర్ (ఐఎఎస్), బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి (ఐఎఎస్)ని మంగళవారం కలిసి సమస్యను వివరించారు. దాంతో స్పందించిన వారు.. కబ్జాపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని రజక ఫెడరేషన్ ఎండి చంద్రశేఖర్‌కు ఆదేశాలు జారీ చేశారు. రజక ఆత్మగౌరవ భవనం నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో కబ్జాకు ప్రయత్నించిన వారి వివరాలు, ఇతర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. స్థలం పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. భవనం నిర్మాణం కోసం కూడా ఏర్పాట్లు చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశయ్య మాట్లాడుతూ.. రజక ఆత్మగౌరవ భవనం కోసం కేటాయించిన స్థలం కబ్జాపై స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వెంటనే స్థానిక అధికారులు రంగంలోకి దిగి గుడిసెలను తొలగించారన్నారు. ప్రభుత్వ కార్యదర్శి స్పందించి రక్షణ ఏర్పాటు చేయాల్సిందిగా సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడం సంతోషకరమన్నారు. అధికారులను కలిసిన వారిలో రజక వృత్తిదారుల సంఘం మేడ్చల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కార్యదర్శులు జ్యోతి ఉపేందర్, ఎం గోపాల్, సి మల్లేష్, మేడిపల్లి అధ్యక్షులు అంబే చక్రపాణి, సోషల్ మీడియా కన్వీనర్ పి భాస్కర్, ఉప్పల్ జోన్ కన్వీనర్ సట్టు రవి, రాష్ట్ర నాయకులు కాశయ్య, యాదగిరి పాల్గొన్నారు.

బిసి సంక్షేమ అధికారులను కలిసిన రజక వృత్తిదారుల సంఘం నాయకులు

జయంత్ నార్లికర్ మృతికి విజ్ఞానదర్శిని సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహా విజ్ఞాని, ప్రఖ్యాత ఖగోళ వైజ్ఞానికవేత్త పద్మభూషణ్ జయంత్ నార్లికర్ మరణం పట్ల విజ్ఞానదర్శిని సంతాపం తెలిపింది. ఈ మేరకు మంగళవారం విజ్ఞాన దర్శినీ కేంద్ర చాప్టర్ అధ్యక్షుడు రమేష్, కేంద్ర చాప్టర్ ప్రధానకార్యదర్శి గుంటుపల్లి శ్రీతేజ, కేంద్ర చాప్టర్ సహాయ కార్యదర్శి శోభారాణి, కేంద్ర చాప్టర్ కోశాధికారి రాంమూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు బొల్లి ఆదాంరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఆలీ, రాష్ట్ర కోశాధికారి జయప్రసాద్ ఒక ప్రకటన విడుదల చేశారు. 27 ఏళ్లకే పద్మభూషణ్ అవార్డు సాధించిన గొప్ప వైజ్ఞానికవేత్త జయంత్ నార్లికర్ అని పేర్కొన్నారు. ఈ రికార్డును నేటికీ ఎవరూ అధిగమించకపోవడం తన అద్వితీయ మేధకు నిదర్శనమని తెలిపారు. భారత వైజ్ఞానిక పతాకను విశ్వ వీధుల్లో ఎగరేసిన ఖగోళ విజ్ఞాని అని చెప్పారు. ఈ నెల 19 రాత్రి కన్నుమూసిన ఆయన ఖగోళ భౌతిక విజ్ఞానం, విశ్వ విజ్ఞాన రంగాలలో చేసిన అద్వితీయ కృషి ఎంతో ప్రసిద్ధమైనదని పేర్కొన్నారు. తనొక విశిష్ట విజ్ఞాన సందేశకర్త, ఐయుసిఎఎ స్థాపకులు, విజ్ఞాన ప్రచారం కోసం యునెస్కో కళింగ అవార్డు గ్రహీతగా ఆయన కృషిని దేశం ఎల్లప్పుడూ గుర్తుంచుకోదగినదని తెలిపారు. తను చాలా సులభంగా అందరికీ అర్థం అయ్యేలా ఖగోళ వైజ్ఞానిక అంశాలను వివరిస్తూ ఎన్నో పుస్తకాలను రచించారని చెప్పారు. జయంత్ నార్లికర్ మరణం దేశానికే కాకుండా ప్రపంచ ఖగోళ విజ్ఞాన రంగానికే తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.

పెంచిన మెట్రో చార్జీలపై పది శాతం డిస్కౌంట్

- ఎల్అండ్‌టి మెట్రో రైల్ సంస్థ ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల పెంచిన మెట్రో రైలు చార్జీలపై ఎల్అండ్‌టీ మెట్రో రైల్ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. వివిధ వర్గాల ప్రజలు, సిపిఎం, ఇతర వామపక్ష పార్టీల ఆందోళనలతోపాటు ప్రజాసంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవ్వడంతో పెంచిన చార్జీలపై 10శాతం డిస్కౌంట్ ప్రకటించింది. మూడు మెట్రో కారిడార్లలోని అన్ని జోన్లలో కొత్తగా సవరించిన చార్జీలపై ఈ డిస్కౌంట్ వర్తించనుంది. ఈ డిస్కౌంట్ చార్జీలు ఈనెల 24 నుంచి అమల్లోకి రానున్నాయని ఆ సంస్థ వెల్లడించింది. ఫేర్ ఫిక్సేషన్ కమిటీ (ఎఫ్ఎఫ్‌సి) సిఫార్సుల మేరకే చార్జీలను పెంచినట్టు తెలిపింది. ఈ మేరకు ఎల్అండ్‌టీఎంఆర్‌హెచ్ఎల్ సీఎండీ కేవీబీ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. దీర్ఘకాలంలో మెట్రో కార్యకలాపాలను సుస్థిరంగా నిర్వహించుకోగలిగేందుకు ఉద్దేశించిన సమగ్ర వ్యూహంలో భాగంగా చార్జీలు సవరించినట్టు తెలిపారు. ఆర్థికంగా దూరదృష్టితో వ్యవహరిస్తూ, ప్రయాణికులకు అందుబాటు స్థాయిలో సేవలు అందించాలన్న సంస్థ నిబద్ధతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. మెట్రో కార్యకలాపాలను నిలకడగా కొనసాగించేందుకు చార్జీలను సవరించక తప్పలేదని, అయినప్పటికీ ప్రయాణికులపై ఆర్థిక భారం పడనివ్వకుండా చూడాలనే అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్, వారి వెసులుబాటు మేరకు కొత్తగా సవరించిన చార్జీలపై పది శాతం డిస్కౌంట్ ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్నామని, అందుబాటు చార్జీల్లో రోజువారీ ప్రయాణాలకు వీలు కల్పించాలన్న తమ చిత్తశుద్ధికి ఇది నిదర్శనంగా నిలుస్తుందని కెవిబి రెడ్డి వివరించారు. ఈ నెల 24 నుంచి మూడు మెట్రో కారిడార్లలోని అన్ని జోన్‌లో పెంచిన చార్జీలపై ఈ డిస్కౌంట్ అమల్లోకి వస్తుంద న్నారు. సవరించిన చార్జీలు, ఇతర అప్‌డేట్‌ల సమగ్ర సమాచారం కోసం ప్రయాణికులు తమ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎల్‌టీమెట్రో.కామ్‌ను సందర్శించగలరని విజ్ఞప్తి చేశారు. కాగా ఇటీవల ఎల్అండ్‌టీ మెట్రో సంస్థ కనీస చార్జి రూ.10 నుంచి 12కు, గరిష్ట చార్జి రూ.60 నుంచి 75కు పెంచిన విషయం తెలిసిందే.

సత్యసాయి సేవా సంస్థ డేటా ఇంజనీరింగ్ శిక్షణ పూర్తి

హైదరాబాద్ : శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో 90 రోజుల పాటు నిర్వహించిన డేటా ఇంజనీరింగ్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్లు ఆ సంస్థ పేర్కొంది. నాలెడ్జ్ సిటీలోని టి-హబ్‌లో జరిగిన ముగింపు వేడుకలో 80 మంది నిరుపేద గ్రాడ్యుయేట్లకు శిక్షణ పూర్తయినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అనంతరం వారికి ధృవపత్రాలు అందజేశారు. అంతేకాకుండా, 22 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను కూడా అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సిఇఒ శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో తమకు భాగస్వామ్యం ఉండటం గర్వంగా ఉందని తెలిపారు.

సాగు నీళ్లివ్వకుండా ... మోటార్లు, సోలార్ విద్యుత్‌తో ఏం లాభం?

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాగు నీళ్లివ్వకుండా మోటార్లు, సోలార్ విద్యుత్‌తో ఏం లాభం? అని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే ప్రకటించిచన డిక్లరేషన్లు అలంకార ప్రాయంగా మారాయనీ, ఇంకెన్ని డిక్లరేషన్లు ప్రకటించినా ప్రజలు రేవంత్ రెడ్డిని నమ్మబోరని తెలిపారు. కాంగ్రెస్ కు గట్టి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సోమవారం నాటి సభలో చెంచుల గొంతు నొక్కారనీ, వారిని సభ వద్దకు రాకుండా అడ్డుకున్నారని తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్ హయాంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీ జరిగిందని, ఎన్నికల కోడ్‌తో ఆగిన పట్టాలనే రేవంత్ రెడ్డి పంపిణీ చేశారే తప్ప కొత్తగా చేసిందేమి లేదన్నారు. ఉమామహేశ్వర, చెన్న కేశవ రిజర్వాయర్లకు కెసిఆర్ హయాంలోనే శంకుస్థాపన లు జరిగాయని గుర్తుచేశారు. గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాదంలో 17 మంది చనిపోయినా అటు వైపు వెళ్లని అసమర్థ సిఎం రేవంత్ రెడ్డి అని విమర్శించారు. నల్లమల్లలో యురేనియం వెలికితీతను అడ్డుకున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ దిగివచ్చినా నల్లమల సంపదను తరలించుకుపోనివ్వమని హెచ్చరించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి మాయమాటలను ఎవ్వరూ నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. కెసిఆర్‌ను విమర్శించడమే తప్ప రేవంత్ చేసిందేమి లేదన్నారు. బిఆర్ఎస్ నాయకులు భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ గిరిజన ఆదివాసీల ఓట్లతోనే గెలిచిన కాంగ్రెస్ ఆ వర్గాలను మోసం చేసిందని విమర్శించారు. మరో మూడేళ్లు కాంగ్రెస్ ను ఎలా భరించాలని గిరిజనులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు.

సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలి : డిటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలని డిటిఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని మంగళశారం హైదరాబాద్‌లో నిర్వహించారు. అనంతరం డిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి అన్ని స్థాయిల్లోని పర్యవేక్షక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 33 జిల్లాలకుగాను 12 జిల్లాల్లోనే రెగ్యులర్ డిఇఒ పోస్టులున్నాయని తెలిపారు. మిగిలిన 21 జిల్లాలకు డీఈవో పోస్టులను మంజూరు చేయాలని కోరారు. ఆయా జిల్లాల్లో బోధనతో సంబంధం లేని అధికారులు ఇన్‌చార్జీ డిఇఒలుగా బాధ్యతలను నిర్వహిస్తున్న కారణంగా విద్యారంగంలో సరైన పర్యవేక్షణ కొరవడి ఆశించిన ఫలితాలు రావడం లేదని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ఒకే జిల్లాలో పనిచేస్తున్న డిఇఒలను బదిలీ చేయాలని సూచించారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను నియమించాలని తెలిపారు. ఈవి నరసింహారెడ్డి బదిలీ చేసినప్పటికీ కొత్త డైరెక్టర్‌ను నియమించకపోవడం వల్ల ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అనేక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఐదు డిఎలను విడుదల చేయాలని తెలిపారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని 2023, జులై ఒకటి అమలుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వం సాచివేత ధోరణిని ప్రదర్శిస్తే భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ చేపడతామని తెలిపారు.

బిఆర్ఎస్ రజతోత్సవలకు డల్లాస్ సిద్ధం

- వేడుకలకు హాజరవుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు డల్లాస్ సిద్ధమైంది. ఎల్కతుర్తి సభ తరహాలోనే డల్లాస్‌లో వేడుకలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కెటిఆర్ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో వేడుకలు నిర్వహించే అమెరికా డల్లాస్ నగరంలోని డాక్టర్ పెప్పర్ ఏరిన కామెరికా సెంటర్‌ను బిఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాల సందర్శించారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఏర్పాట్లపై స్థానిక బిఆర్ఎస్ నేతలు, అభిమానులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ ఆత్మను ప్రపంచానికి వినిపించేలా వేడుకలు నిర్వహించ నున్నట్టు తెలిపారు. బిఆర్ఎస్ 25 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానాన్ని పురస్కరించుకుని, జూన్ 1న ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సాంస్కృతిక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో కళాకారుల ప్రదర్శనలు జరగనున్నాయి. ఈ మహాసభకు యుఎస్ఏలోని తెలంగాణ , తెలుగు ప్రజలు, బిఆర్ఎస్ మద్దతుదారులు, ఇతర తెలంగాణ సంఘాలు పెద్ద సంఖ్యలో హాజరవుతారని అన్ని సంఘాలు మద్దతు తెలిపాయని వెల్లడించారు. బిఆర్ఎస్ యూఎస్ఏ అడ్వైజరీ బోర్డు చైర్మెన్ తన్నీరు మహేష్ మాట్లాడుతూ ఈ వేడుక అమెరికాలో బిఆర్ఎస్ చరిత్రలో మైలురాయిగా నిలిచే వేడుక అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏర్పాట్ల పర్యవేక్షణలో బిఆర్ఎస్ యుఎస్ఎ నాయకులు శ్రీనివాస్ శురభి, హరీష్ రెడ్డి, శ్రీనివాస్, సురకంటి తదితర సభ్యులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో విద్యార్థుల నమోదుకు 25 నుంచి ప్రచార జాతాలు

- టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడం కోసం ఈ నెల 25 నుంచి 31 వరకు ప్రచార జాతాలను నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ తెలిపింది. వారంరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కమిటీలు, మండల కమిటీల ఆధ్వర్యంలో ఈ ప్రచార జాతాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని టిఎస్‌యుటిఎఫ్ మండల కమిటీల బాధ్యులు కార్యకర్తలు వారు పనిచేస్తున్న పాఠశాలలతోపాటు మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా బృందాలుగా ఏర్పడి పాటలు, కళారూపాలతో ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను వివరించాలని కోరారు. ప్రభుత్వ బడులను పరిరక్షించుకోవడంలో ప్రజల భాగస్వామ్యాన్ని తెలియజేయాలని సూచించారు. విద్యార్థుల నమోదు కోసం ప్రచారం చేస్తామని తెలిపారు. ప్రయివేట్ స్కూళ్లకు వెళ్లే పిల్లలను ప్రభుత్వ బడికి రప్పించుకోవాలనే కర్తవ్యంతో ఈ జాతాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ వారంరోజుల ప్రచార జాత కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు టిఎస్‌యుటిఎఫ్ ప్రతి కార్యకర్త పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.

తుది దశకు రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల వెరిఫికేషన్

- 25వ తేదీ నుంచి జిల్లా స్థాయిలో కసరత్తు
- జూన్ 2న ప్రొసీడింగ్ కాపీల అందజేత
- సిబిల్ స్కోర్‌తో దరఖాస్తుదారుల్లో ఆందోళన
- ఉప కులాల రిజర్వేషన్లకు ప్రాధాన్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ చకచకా సాగుతోంది. మండలాల్లో పరిశీలన ప్రక్రియ కొనసాగుతుండగా.. ఈ నెల 25వ తేదీ నుంచి జిల్లా స్థాయిలో వెరిఫికేషన్ ఉంటుంది. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా అర్హులను ప్రకటించనున్నారు. అయితే, సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్దిదారుల ఎంపిక ఉండనుండటంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టింది. ఎస్సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, క్రిస్టియన్, ఇబిసి కులాలకు చెందిన వారికి ఈ స్కీం ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు అందించనుంది. గత నెల 14వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించగా.. మండలాల వారీగా అర్హుల జాబితాకు సంబంధించి సిబిల్ స్కోర్ వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. లబ్దిదారులు రూ.50 వేలకు మించి రుణాలు తీసుకోవాలంటే ఆర్బీఐ నిబంధనల ప్రకారం వారి సిబిల్ స్కోర్ ఏ విధంగా ఉందనే విషయాన్ని పరిశీలించి, దాని ఆధారంగానే రుణం మంజూరు చేయనున్నారు. సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రాజీవ్ యువ వికాసం పథకం లబ్దిదారులకు రుణాలు అందిస్తామని ఇటీవల డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రకటించినా.. అధికారుల నుంచి ఎలాంటి స్పష్టతా రాకపోవడంతో దరఖాస్తుదారులు టెన్షన్ పడుతున్నారు.

25 నుంచి జిల్లా స్థాయిలో పరిశీలన

రాజీవ్ యువ వికాసం పథకానికి వచ్చిన దరఖాస్తులను మండల స్థాయిలో పరిశీలిస్తున్నారు. మండలంలో స్పెషల్ ఆఫీసర్‌గా ఎంపిడిఒ, మున్సిపాల్టీలో స్పెషల్ ఆఫీసర్‌గా మున్సిపల్ కమిషనర్, జిహెచ్ఎంసిలో సర్కిల్ స్పెషల్ ఆఫీసర్‌గా సర్కిల్ ఉప కమిషనర్, లీడ్ బ్యాంకు మేనేజర్, డిఆర్‌డిఎ పిడి, కార్పొరేషన్ ప్రతినిధి ఆధ్వర్యంలో పరిశీలన జరుగుతోంది. దరఖాస్తుదారుడి బ్యాంకు సిబిల్ స్కోర్, అర్హతకు సంబంధించి అన్ని కోణాల్లో పరిశీలన చేస్తారు. ఈ నెల 25వ తేదీ వరకు జిల్లా కమిటీకి పంపిస్తారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, ఆదనపు కలెక్టర్, ఎస్సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ శాఖల అధికారులు, లీడ్ బ్యాంకు మేనేజర్, ఇండస్ట్రియల్ జిఎం, డిడబ్ల్యుఒ, డిఆర్‌డిఒ పిడి ఆధ్వర్యంలో చివరి దశ పరిశీలన చేసి జాబితాను సిద్ధం చేస్తారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజైన జూన్ 2వ తేదీన రాజీవ్ యువ వికాసంలో అర్హత సాధించిన యువతీ, యువకులకు రుణ మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తారు.

ఉప కులాల వారీగా రిజర్వేషన్లు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 66,648 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో బీసీ, ఈబీసీ-37,935, ఎస్సీ-16,300, ఎస్టీ-2,196, మైనార్టీ, క్రిస్టియన్-10,219 మంది ఉన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో ఉప కులాల రిజర్వేషన్లను పాటించనున్నారు. గ్రూప్-1 కేటగిరీలో వచ్చే కులాలకు 6.67 శాతం, గ్రూప్-2 కేటగిరీలో వచ్చే కులాలకు 60 శాతం, గ్రూప్-3 కేటగిరిలో వచ్చే కులాలకు 33 శాతం మేర రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకుంటారు. అలాగే మహిళలకు 25 శాతం, వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్లను కేటాయించారు.

సిబిల్.. గుబుల్..

దరఖాస్తు చేసుకున్న వారిలో సిబిల్ స్కోర్ టెన్షన్ పుట్టిస్తోంది. సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదని ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించినా.. లబ్దిదారుల్లో మాత్రం ఆందోళన తగ్గలేదు. బ్యాంకు లావాదేవీలు చేసే ప్రతి ఒక్కరికీ సిబిల్ స్కోర్ అనేది చాలా ముఖ్యం. రుణం తీసుకునే సమయంలో దీన్ని ప్రామాణికంగా పరిగణించి.. సదరు వ్యక్తి అర్హతను నిర్ధారిస్తారు. బ్యాంకులో తీసుకున్న రుణం సకాలంలో చెల్లించకపోయినా.. పాతబకాయి కోసం వన్ టైం సెటిల్‌మెంట్ చేసుకున్నా.. ఇలా అనేక రకాల పద్ధతులపై సిబిల్ స్కోర్ ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో మెజార్టీ ప్రజలు సిబిల్ స్కోర్‌కు అర్హత సాధించే అవకాశం లేదని చర్చ జరుగుతోంది.

మారిన ఆర్బీఐ నిబంధనలు

గతంలో పేదలకు ఆయా పథకాల కింద రుణాలు అందించేవారు. అవసరమైతే సబ్సిడీకి మించి రుణాలు తీసుకుంటే ష్యూరిటీ కింద సంతకాలు తీసుకునేవారే తప్ప, సిబిల్ స్కోర్‌ను పరిగణలోకి తీసుకునేవారు కాదు. కానీ ప్రస్తుతం ఆర్బీఐ నిబంధనల ప్రకారం రూ.50 వేల రుణం దాటితే సదరు వ్యక్తి క్రెడిట్ కార్డు వివరాలు ఇవ్వాల్సి ఉంది. దీంతో సిబిల్ స్కోర్ ఉంటేనే రుణానికి అర్హత సాధిస్తారు. ఇవే నిబంధనలు రాజీవ్ యువవికాసం దరఖాస్తుదారులకు వర్తించనుండటంతో వారిలో గుబుల్ మొదలైంది. కొందరు లబ్దిదారులకు పాన్‌కార్డులు లేకపోగా.. మరికొందరు రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించని వారు సైతం ఉంటారు.